సాక్షి
యాదాద్రి భువనగిరి


శుక్రవారం ၊ 6 ၊ సెప్టెంబర్ ၊ 2024



చిన్న సినిమాలకు చేయూత..

చిన్న సినిమాలకు ప్రభుత్వం తరఫున చేయూతనిస్తామని సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం: 590 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం	: 588.00 అడుగులు
ఇన్‌ఫ్లో	: 54,917 క్యూసెక్కులు
క్రస్ట్‌గేట్లు	: 38,361 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 29,232 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 8,529 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: నిల్
ఏఎమ్మార్పీకి	: నిల్
వరద కాల్వకు	: 600 క్యూసెక్కులు

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం: 645 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం: 641.60 అడుగులు	
ఇన్‌ఫ్లో	: 5,680 క్యూసెక్కులు
క్రస్ట్ గేట్లు	: 2,445 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: నిల్
కుడికాల్వకు	: నిల్



హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నుంచి అవార్డు అందుకుంటున్న ఎంజీయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజిమెంట్ అధ్యాపకుడు మిర్యాల రమేష్, నల్లగొండ ఎన్జీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఎం.అనిల్‌కుమార్, ఆర్.శ్రీధర్, రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు లెక్చరర్ డాక్టర్ కృష్ణకౌండిన్య, మిర్యాలగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎస్‌ఏ కృష్ణకాంత్‌నాయక్, చివ్వెంల మండలం తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్ ఫిజికల్ సైన్స్ టీచర్ గిరిప్రసాద్

న్యూస్‌రీల్

త్రిపుర గవర్నర్‌కు సన్మానం



త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

భువనగిరి : త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి గురువారం హైదరాబాద్ నుంచి వరంగల్ వెళ్తూ భువనగిరిలోని వివేరా హోటల్‌లో కాసేపు ఆగారు. ఆయనకు పార్టీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ తదితరులు స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు.కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్ గుప్తా, భువనగిరి మున్సిపల్ వైస్ చైర్మన్ మాయ దశరథ, నాయకులు పోతంశెట్టి రవీందర్, జనగాం నర్సింహాచారి, రత్నపురం శ్రీశైలం పాల్గొన్నారు.

నృసింహుడికి నిత్యకైంకర్యాలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం నిత్య కైంకర్యాలు ఘనంగా నిర్వహించారు. వేకువజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు.. స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు సుప్రభాత సేవ చేపట్టి అర్చన, అభిషేకం చేశారు. అనంతరం ముఖ మండపం, ప్రాకార మండపంలో అష్టోత్తరం, శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు.

10,11 తేదీల్లో బైక్ ర్యాలీలు

భువనగిరిటౌన్ : బునాదిగాని కాలువకు నిధులు మంజూరు చేయాలని, గోదావరి జలాలు అందించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 10,11 తేదీల్లో నిర్వహించే బైక్ ర్యాలీల్లో కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ కోరారు. గురువారం భువనగిరిలోని సుందరయ్య భవన్‌లో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బునాది గాని కాలువ పనుల దశాబ్దం గడిచినా పూర్తికాలేదన్నారు. మూసీ కలుషిత నీటితో జనం అనారోగ్యంబారిన పడుతున్నారని, గోదావరి జలాలు అందించాలని కోరారు. అడ్డగూడూరు, మోత్కూరు, ఆత్మకూరు(ఎం), మోటకొండూరు, వలిగొండ, బీబీనగర్, భువనగిరి మండలాల్లో బైక్ ర్యాలీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో కొండమడుగు నరసింహ, మాయ కృష్ణ, గడ్డం వెంకటేష్, ముత్యాలు, లావుడియా రాజు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

బొమ్మలరామారం(తుర్కపల్లి) : చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో ఉండవచ్చని జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి సూచించారు. తుర్కపల్లి మండలం మాధాపూర్, పల్లెపహాడ్ అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఆమె సందర్శించారు. లబ్ధిదారులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.నవజాత శిశువులకు ఆరు నెలల వరకు తల్లి పాలు తాగించాలన్నారు. అనంతరం వంట సరుకులను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శిల్పిని, మెడికల్ ఆఫీసర్లు రుచిరా, రాహుల్‌కుమార్, సీపీడీఓ స్వరాజ్యం పాల్గొన్నారు.

ఇంటికి ఒకరు.. ఇద్దరు!

వణికిస్తున్న విషజ్వరాలు

- రోగులతో కిటకిటలాడుతున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు
- రోజూ వందల సంఖ్యలో నమోదవుతున్న ఓపీ
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకూ పెరిగిన రోగుల తాకిడి
- పెద్ద ఎత్తున డెంగీ కేసులు
- అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్న వైద్యాధికారులు

విషజ్వరాలు జిల్లాను వణికిస్తున్నాయి. ఏ ఇంట్లో చూసినా ఒకరు, ఇద్దరు జ్వరంతో బాధపడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులన్నీ రోగులతో కిటకిటలాడుతున్నాయి. జిల్లా కేంద్ర ఆస్పత్రిలో సాధారణ రోజుల్లో 350 వరకు ఓపీ నమోదవుతుండగా.. గడిచిన పది రోజులుగా వెయ్యికి పైగా రోగులు వస్తున్నారు. ఆలేరు, రామన్నపేట, చౌటుప్పల్ ఆస్పత్రులతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రోగుల తాకిడి విపరీతంగా పెరిగింది.



రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలోని జనరల్ వార్డులో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

రామన్నపేట : మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఓపీ భారీగా పెరిగింది. సాధారణ రోజుల్లో 150 వరకు అవుట్ పేషెంట్లు వస్తుండగా.. పది రోజులుగా 300కు పైనే నమోదవుతోంది. ఆస్పత్రిలో వార్డులన్నీ జ్వరపీడితులతోనే నిండిపోయాయి. బెడ్లు దొరక్క రోగులు ఇబ్బంది పడుతున్నారు. ప్రసూతి మహిళల వార్డును సైతం జనరల్ వార్డుగా మార్చి సర్దుబాటు చేస్తున్నారు. ఇన్‌పేషెంట్లలో 80 శాతం మంది జ్వరం, వంటి నొప్పులు, జలుబు, దగ్గుతో బాధపడుతున్న వారే ఉంటున్నారు. మిగిలినవారిలో టైఫాయిడ్, డయేరియా బాధితులు ఉన్నారు. డెంగీ కేసులు కూడా పెద్ద ఎత్తున నమోదవుతున్నట్లు తెలుస్తోంది. డెంగీ లక్షణాలుంటే నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి పంపుతున్నారు.

పీహెచ్‌సీలకూ క్యూ కడుతున్న రోగులు

రామన్నపేట మండలం మునిపంపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు దాని పరిధిలోని సబ్‌సెంటర్లకు ఓపీ పెరిగింది. పీహెచ్‌సీలో రోజూ 100 వరకు ఓపీ నమోదవుతుండగా, సబ్‌సెంటర్లకు 200మంది వరకు వస్తున్నట్లు వైద్యులు తెలిపారు. గ్రామీణ వైద్యుల వద్దకు వెళ్లేవారి సంఖ్య మరో 300 వరకు ఉంటుంది. వెల్లంకి, సిరిపురం గ్రామాల్లో చాలా మంది కామెర్ల వ్యాధితో పడుతున్నట్లు తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆరోగ్య సర్వేలోనూ అత్యధిక కుటుంబాల్లో జ్వరపీడితులు ఉన్నట్లు తెలుస్తోంది.

ఐదు డెంగీ కేసులు..

చాపకింద నీరులా డెంగీ విస్తరిస్తోంది. రామన్నపేట, పల్లివాడ, సర్నేనిగూడెం, జనంపల్లి, వెల్లంకి గ్రామాల్లో ఐదు డెంగీ కేసులు నమోదు అయ్యాయి. వారిలో ఇద్దరు ఇతర ప్రాంతాల్లో డెంగీ బారిన పడ్డారు. ప్రస్తుతం వారంతా కోలుకొని ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యాధికారులు తెలిపారు.

జాగ్రత్తలు తప్పనిసరి

ఆరోగ్య పరిరక్షణకు ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలి. వేడిచేసి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలి. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలి. కొబ్బరి బోండాలు, టైర్లు, పూలకుండీల్లో నీరు నిలువ ఉంచరాదు. జ్వరం వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించాలి.

–అశ్వినికుమార్, రామన్నపేట మండల వైద్యాధికారి

ఆలేరులో డాక్టర్ల కొరత



ఆలేరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు వైద్యపరీక్షల కోసం వచ్చిన రోగులు

ఆలేరురూరల్ : పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌తో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలకు రోగులు పోటెత్తుతున్నారు. ఆలేరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోజే 400కు పైనే ఓపీ నమోదవుతోంది. 30 ఇన్‌పేషెంట్ కేసులు నమోదు అవుతున్నాయి. ఈ వారంలో డెంగీ 3, టైఫాయిడ్ 10 కేసులు వెలుగుచూశాయి. రోజూ 30 విష జ్వరాల కేసులు నమోదు అవుతున్నాయని ఆలేరు సీఎచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ స్వప్న తెలిపారు. తీవ్రత ఉన్న వారికి సీఎచ్‌సీలోనే వైద్యం అందిస్తున్నారు. కొందరికి మందులిచ్చి పంపిస్తున్నారు.

12 మందికి.. ఆరుగురే వైద్యులు

ఆలేరు సీఎచ్‌సీలో 12 మంది డాక్టర్లకు గాను ఆరుగురు ఉన్నారు. డాక్టర్ల కొరత వల్ల ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్యం అందక ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. అలాగే కొన్ని వ్యాధులకు సంబంధించి మందుల కొరత ఉన్నట్లు తెలసింది.

జిల్లా ఆస్పత్రిలో వార్డులన్నీ ఫుల్..

భువనగిరి టౌన్ : జిల్లా కేంద్ర ఆస్పత్రి రోగులతో కిటకిటలాడుతోంది. ఆస్పత్రికి సాధారణ రోజుల్లో 350 వరకు ఓపీ వస్తుండగా గత పది రోజులుగా వెయ్యికి పైనే నమోదువుతోంది. ఇందులో 80 శాతం మంది జ్వరం, దగ్గు, జలుబు లక్షణాలతో ఉంటున్నారు. డెంగీ కేసులు కూడా వెలుగుచూస్తున్నాయి. ప్రస్తుతం ఆస్పత్రిలో 45 మంది ఇన్‌పేషెంట్లు ఉన్నారు.భువనగిరి పట్టణంలోని పగిడిపల్లి ఆశ్రమ పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు గురువారం ఆస్పత్రికి వచ్చారు. తలనొప్పి, జ్వరం ఉండడంతో వైద్యపరీక్షల నిమిత్తం వచ్చినట్లు వారు తెలిపారు. అదే విధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రైవేట్ ఆస్పత్రులు రోగులతో కిక్కిరిసిపోతున్నాయి.



జ్వరంతో ఆస్పత్రికి వచ్చిన విద్యార్థులు

నాలుగు రోజుల నుంచి జ్వరం

నా భర్యకు నాలుగు రోజుల నుంచి జ్వరం వస్తుండడంతో భువనగిరి ఆస్పత్రికి తీసుకువచ్చాను. రక్త పరీక్షలు చేశారు.గ్రామంలో చాలా మందికి జ్వరాలు వస్తున్నాయి. కొందరు ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లారు.

-రాములమ్మ, మన్నెవారిపంపు



జిల్లా కేంద్ర ఆస్పత్రిలో జ్వర పీడితులతో నిండిన జనరల్ వార్డు

ఉపాధ్యాయులు నవ సమాజ నిర్మాతలు



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులతో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే, అదనపు కలెక్టర్లు గంగాధర్, బెన్‌షాలోమ్, డీఈఓ నర్సింహ

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

భువనగిరి : ఉపాధ్యాయులు నవ సమాజ నిర్మాతలని, మట్టిలో మాణిక్యాలను తయారు చేసే శక్తి ఉపాధ్యాయులకు మాత్రమే ఉంటుందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. గురువారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని, అందులో భాగంగా జిల్లాలో రూ.23.80 కోట్లతో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తుందని తెలిపారు. విద్యా వ్యవస్థను మరింతగా పటిష్టం చేసేందుకు డీఎస్సీ ద్వారా ఖాళీలు భర్తీ చేయనుందన్నారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చి దిద్దడంలో ఉపాధ్యాయులు కృషి ఎంతో గొప్పదన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని, తద్వారా విద్యార్థుల సంఖ్య పెరుగుతుందన్నారు. కలెక్టర్ హనుమంతు కే.జెండగే మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. సినీ నటి మంచు లక్ష్మి జిల్లాలోని 85 పాఠశాలలను దత్తత తీసుకుని స్మార్ట్ క్లాసులు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 25 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. అంతకు ముందు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు గంగాధర్, బెన్ షాలోమ్, మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు, డీఈఓ నర్సింహ, జెడ్పీ సీఈఓ శోభారాణి, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకే కార్డన్ సెర్చ్

- భువనగిరి ఏసీపీ రవికిరణ్‌రెడ్డి

భువనగిరి క్రైం : శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగానే కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు భువనగిరి ఏసీపీ రవికిరణ్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని అర్బన్ కాలనీలో గురువారం భువనగిరి పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు వంద ఇళ్లలో తనిఖీలు నిర్వహించి ఆధార్ కార్డు, తదితర ధ్రువీకరణపత్రాలను పరిశీలించారు. సరైన పత్రాలు లేని ఆరు వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. గుట్కాలు, డ్రగ్స్ విక్రయించిన వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. అనుమానిత వ్యక్తులు సంచరించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐలు సురేష్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌ఐలు, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.



కార్డన్‌సెర్చ్‌లో పాల్గొన్న పోలీసులు

ఖాతాదారులకు మెరుగైన సేవలు

భూదాన్‌పోచంపల్లి : మారుతున్న కాలాగుణంగా నూతన సాంకేతిక సేవలను అందుబాటులోకి తెచ్చి ఖాతాదారులకు కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా మెరుగైన సేవలందిస్తున్నామని పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ తడక రమేశ్ తెలిపారు. గురువారం భూదాన్‌పోచంపల్లిలో జరిగిన బ్యాంకు సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకు వ్యాపారం 2023–04 ఆర్థిక సంవత్సరంలో రూ.325.37 కోట్లకు చేరిందని, రూ.256.57 కోట్ల నికర లాభాన్ని ఆర్జించిందన్నారు. ఇప్పటి వరకు రూ.204.23 కోట్ల డిపాజిట్లు, రూ.7.19 కోట్ల వాటాధనం సేకరించి, రైతులు, వ్యాపారులకు రూ.144.22 కోట్ల రుణాలు ఇచ్చామని వెల్లడించారు. అలాగే ఖాతాదారులకు బ్యాంకు అందిజేస్తున్న పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై, జీజేపీపీ తదితర పాలసీలను వినియోగించుకోవాలని కోరారు. ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందిన శివారెడ్డిగూడేనికి చెందిన ఖాతాదారుడు నోముల మల్లారెడ్డి కుటుంబానికి లక్ష రూపాయల బీమా చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సీఈఓ సీత శ్రీనివాస్, బ్యాంకు వైస్ చైర్మన్ భారత రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లు కర్నాటి బాలసుబ్రహ్మణ్యం, ఏలే హరిశంకర్, సూరెపల్లి రమేష్, రాపోలు వేణు, గుండు కావ్య, కర్నాటి భార్గవి, కొండమడుగు ఎల్లస్వామి, మాజీ చైర్మన్లు చిట్టిపోలు శ్రీనివాస్, సీత దామోదర్, వ్యవస్థాపకులు కొండ శంకరయ్య, సిద్దగోని రంగయ్య, నాయకులు సీత సత్యనారాయణ, భారత లవకుమార్, బ్యాంకు బ్రాంచ్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పోచంపల్లి కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ తడక రమేశ్

'ఓరుగంటి' ఉద్యమ స్ఫూర్తి మరువలేనిది

- త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి

నల్లగొండ టూటౌన్: ఎన్ని అడ్డంకులు ఎదురైనా నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి బీజేపీ బలోపేతానికి ఉద్యమ స్ఫూర్తితో పనిచేసిన వ్యక్తి ఓరుగంటి రాములు అని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. గురువారం నల్లగొండలోని లక్ష్మీగార్డెన్స్‌లో నిర్వహించిన దివంగత బీజేపీ నేత ఓరుగంటి రాములు ప్రథమ వర్ధంతి సంస్మరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాములు విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ పాత, కొత్త అనే తేడా లేకుండా ప్రజా సమస్యలపై ఓరుగంటి రాములు ఢిల్లీలో కూడా ఆందోళన చేసిన వ్యక్తి అని కొనియాడారు. తాను ఎమ్మెల్యేగా, ఎంపీగా పోటీ చేసినప్పుడు తన గెలుపు కోసం రాములు ఎంతగానో కృషి చేశారన్నారు. రాములు సంఘ్ కార్యకర్త నుంచి బీజేపీలో సీనియర్ లీడర్‌గా ఎదిగారని, ఎంపీగా, ఎమ్మెల్యేగా పోటీ చేసి సఫలీకృతం కాకున్నా పార్టీని గ్రామగ్రామానికి తీసుకెళ్లాడన్నారు. మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ ఓరుగంటి రాములు పుట్టినప్పటి నుంచి చనిపోయే వరకు ప్రజలు, ధర్మం, హిందూ సమాజ రక్షణ కోసం పాటుపడ్డారన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా నిలిచి జిల్లాలో పార్టీని బలోపేతం చేసిన వ్యక్తి ప్రమాదంలో చనిపోవడం బీజేపీకి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో ఓరుగంటి రాములు సతీమణి ధనలక్ష్మి, ఆయన కుమారులు ఓరుగంటి వంశీ, ఓరుగంటి శ్రీనివాస్, ఓరుగంటి మాధవప్రసాద్, బీజేపీ నాయకులు నూకల నర్సింహారెడ్డి, పిల్లి రామరాజుయాదవ్, కల్లెం బాల్‌రెడ్డి, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఓరుగంటి రాములు విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

దరఖాస్తుదారులందరికీ నోటరీ లైసెన్స్ ఇవ్వాలి

భువనగిరి క్రైం : దరఖాస్తు చేసుకున్న ప్రతి న్యాయవాదికి నోటరీ లైసెన్స్ ఇవ్వాలని ఐలు జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం భువనగిరి కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వివిధ కారణాలతో నోటరీ న్యాయవాదుల పోస్టులు ఖాళీ ఏర్పడ్డాయని, పదేళ్ల నుంచి కొత్త నోటిఫికేషన్ వేయక పోవడంతో భర్తీకి నోచుకోవడం లేదన్నారు. పెరుగుతున్న జనాభా, డాక్యుమెంటేషన్ అవసరాలకు అనుగుణంగా నోటరీ అడ్వకేట్‌లను పెంచాలని, భువనగిరి, రామన్నపేట, చౌటుప్పల్, ఆలేరు, యాదగిరిగుట్ట కోర్టులకు నూతన భవనాలు నిర్మించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐలు జిల్లా ఉపాధ్యక్షుడు కుక్కదువ్వ సోమయ్య, న్యాయవాదులు తడక మోహన్, పాల్వంచ జగతయ్య, సీసా శ్రీనివాస్, బొల్లెపల్లి కుమార్, చింతల రాజశేఖర్ రెడ్డి, బొడ్డు కిషన్, ఎండీ నిహాల్ పాల్గొన్నారు.

చిట్యాలలో 'ఐఏఎఫ్' హెలికాప్టర్ ల్యాండింగ్

- సాంకేతిక లోపంతో పొలాల మధ్య నిలిపిన పైలెట్.. తప్పిన ముప్పు

చిట్యాల: చిట్యాల పట్టణ శివారులోని వ్యవసాయ పొలాల్లో గురువారం ఐఏఎఫ్(ఇండియన్ ఎయిర్ ఫోర్స్)కు చెందిన హెలికాప్టర్ సాంకేతిక లోపంతో ఆగిపోయింది. విజయవాడలో వరద సహాయక చర్యల్లో పాల్గొనేందుకు వెళ్లిన రెండు హెలికాప్టర్‌లు అనంతరం హకీంపేటకు వెళ్లేందుకు గురువారం ఉదయం బయలుదేరాయి. 11:30 గంటల సమయంలో చిట్యాల పట్టణ శివారులోకి రాగానే వాటిలో ఒక హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. దీన్ని గుర్తించిన పైలెట్ చాకచక్యంగా వ్యవసాయ పొలాల్లో నెమ్మదిగా ల్యాండ్ చేశాడు. అనంతరం ఈ హెలికాప్టర్‌తో వచ్చిన మరో హెలికాప్టర్ సైతం మొదటగా కిందికి దిగింది. సాంకేతిక లోపంతో నిలిచిపోయిన హెలికాప్టర్‌ను పరిశీలించిన పైలెట్స్ మరమ్మతులకు అవసరమైన టెక్నీషియన్‌ను తీసుకువచ్చేందుకు హకీంపేటకు ఆ రెండో హెలికాప్టర్ బయలుదేరింది. అనంతరం మధ్యాహ్న సమయంలో హకీంపేట నుంచి వచ్చిన టెక్నీషియన్స్ సాంకేతిక సమస్యలకు గురైన హెలికాప్టర్‌లో మరమ్మతులు చేపట్టగా తిరిగి హకీంపేటకు మధ్యాహ్నం 3:30 గంటల సమయంలో తిరిగివెళ్లిపోయింది. కాగా హెలికాప్టర్ పైలెట్ చాకచక్యంగా సాంకేతిక సమస్యను గుర్తించటంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. ఈ హెలికాప్టర్‌లో పైలెట్‌తో పాటు మరో ఇద్దరు ప్రయాణిస్తున్నారు. హెలికాప్టర్ ఆగిన విషయం తెలుసుకున్న చిట్యాల ఏఎస్‌ఐ జాన్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకున్నారు. మరమ్మతులకు గురైన హెలికాప్టర్‌కు టెక్నీషియన్స్‌తో రిపేర్ చేయించేంత వరకు ఏఎస్‌ఐ బందోబస్తుగా ఉన్నారు.



చిట్యాలవద్ద ఆగిన హెలికాప్టర్‌కు మరమ్మతులు చేసేందుకు టెక్నీషియన్లతో వచ్చిన మరో హెలికాప్టర్



హెలికాప్టర్ వద్ద వ్యవసాయ కూలీల కోలాహలం

వ్యవసాయ కూలీల సందడి

చిట్యాల శివారులోని వ్యవసాయ పొలాల్లో అకస్మాత్తుగా హెలికాప్టర్ ల్యాండ్ కావడంతో ఆ ప్రాంతంలో సందడి నెలకొంది. పొలం పనుల్లో నిమగ్నమైన కూలీలు హెలికాప్టర్ వద్దకు చేరుకుని సెల్‌ఫోన్లతో ఫొటోలు దిగారు. హెలికాప్టర్ ఆగిన విషయం తెలుసుకున్న చిట్యాలతో పాటు వనిపాకల గ్రామస్తులు అక్కడికి చేరుకుని సెల్ఫీలు దిగారు.

క్లుప్తంగా

చెరువు తూము ధ్వంసం



ధ్వంసమైన కోమటికుంట చెరువు తూము

చిలుకూరు: మండలంలోని బేతవోలు కోమటి కుంట చెరువు తూమును గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. చెరువు భూమి ఆక్రమణదారులు వారి భూములు మునిగిపోకుండా ఉండేందుకు కావాలనే తూమును ధ్వంసం చేసి షట్టర్ పక్కకు వేశారని గ్రామస్తులు ఆరోపించారు. చెరువు నీరు వృథాగా పోతోందని, ఐబీ అధికారులు స్పందించి తూమును ధ్వంసం చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చోరీ కేసులో ఇద్దరికి ఆరునెలల జైలు

చౌటుప్పల్ : ద్విచక్రవాహనం చోరీ కేసులో ఇద్దరికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ చౌటుప్పల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు గురువారం తీర్పునిచ్చింది. ఆత్మకూర్(ఎం) మండలంలోని రాఘవాపురం గ్రామానికి చెందిన బద్దుల అనిల్(26), మోత్కూర్ మండలంలోని సదర్శాపురం గ్రామానికి చెందిన బత్తిని స్వాతి(28) ఈ ఏడాది ఆరెగూడెం స్టేజీ వద్ద ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకెళ్లారు. ఈ మేరకు కేసు విచారణలో ఇద్దరికి ఆరు నెలల జైలు శిక్షతోపాటు రూ.100 చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి మహతీవైష్ణవి తీర్పునిచ్చారు. నిందితులను నల్లగొండ జైలుకు తరలించామని ఎస్ఐ యాదగిరి తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

మర్రిగూడ: బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలైన సంఘటన గురువారం మర్రిగూడ మండలంలో చోటుచేసుకుంది. వట్టిపల్లి గ్రామ పరిధిలోని బట్టపల్లి గ్రామానికి చెందిన దుబ్బ ప్రభాకర్ హైదరాబాద్ నుంచి బైక్‌పై వస్తున్నాడు. తిరగండ్లపల్లి గ్రామ సమీపంలోకి రాగానే గేదె అడ్డురావడంతో బైక్ అదుపుతప్పింది. దీంతో ప్రభాకర్‌తోపాటు బైక్‌పై ఉన్న అతడి స్నేహితుడికి కూడా స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మాల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

రేషన్ బియ్యం పట్టివేత



పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డ రేషన్ బియ్యం

మేళ్లచెరువు: ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని గురువారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మేళ్లచెరువు మండలం వేపలమాదారం గ్రామానికి చెందిన నాగులమీరా తన ఇంట్లో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు అతడి ఇంటిపై దాడి చేసి 13 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కొనసాగుతున్న బ్యాడ్మింటన్ పోటీలు

- నేడు ఫైనల్స్

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని ఎన్ఎస్‌పీ క్యాంపు ఇండోర్ స్టేడియంలో మోనెక్స్ సన్‌రైజ్ తెలంగాణ స్టేట్ 3వ మినీ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్–2024 పోటీలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. గురువారం రెండోరోజు సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో సెమీఫైనల్స్ మ్యాచ్‌లు జరిగాయి. బాలుర సింగిల్స్‌లో రంగారెడ్డి–కామారెడ్డి జిల్లాల క్రీడాకారుల మధ్య పోటీ జరగగా.. కామారెడ్డికి చెందిన రుద్రీశ్వర్‌రావు విజయం సాధించాడు. అదేవిధంగా వరంగల్–రంగారెడ్డి క్రీడాకారుల మధ్య జరిగిన పోటీలో వరంగల్‌కు చెందిన మీర్ ఉజైర్ హుస్సేన్ విజయం సాధించాడు. బాలుర డబుల్స్ విభాగంలో నల్లగొండ–హైదరాబాద్ జిల్లాల మధ్య పోటీ జరగగా.. నల్లగొండకు చెందిన కృష్ణారెడ్డి, బాలగంగాధర్‌రెడ్డి విజయం సాధించారు. బాలికల సింగిల్స్ విభాగంలో హైదరాబాద్–ఆదిలాబాద్ క్రీడాకారుల మధ్య జరిగిన పోటీలో హైదరాబాద్‌కు చెందిన అయిరా గెలుపొందింది. అదేవిధంగా సూర్యాపేట–రంగారెడ్డి క్రీడాకారుల మధ్య పోటీ జరగగా.. వీరిలో సూర్యాపేటకు చెందిన అన్విత్‌రెడ్డి విజయం సాధించింది. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు శుక్రవారం జరిగే ఫైనల్స్‌లో తలపడనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

చిన్న సినిమాలకు చేయూతనిస్తాం



సినిమా పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్ తదితరులు

- రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నార్కట్‌పల్లి: చిన్న సినిమాలు ప్రభుత్వం నుంచి చేయూతనిస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. తన స్వీయ దర్శకత్వంలో రేగట్టె లింగారెడ్డి నిర్మిస్తున్న 'మీకు ఇష్టమైతే రేపే మీ పెళ్లి' సినిమాకు సంబంధించిన పోస్టర్, ఆడియోను గురువారం నార్కట్‌పల్లి పరిధిలోని వివేరా హోటల్‌లో గురువారం భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌తో కలసి మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న అంశాలపై సినిమాలు తీయాలని అన్నారు. ఈ సినిమాకు బండారు దాయనయ్య కథా రచయితగా, మ్యూజిక్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, పాశం శ్రీనివాస్‌రెడ్డి, పున్నపురాజు యాదగిరి, కల్లూరి శ్రీను, నేతగాని కృష్ణ, వరల రమేష్ తదితరులు ఉన్నారు.

దీర్ఘకాలిక రుణాలు త్వరగా అందించాలి

- డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ అగ్రికల్చర్: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ద్వారా రైతులకు దీర్ఘకాలిక రుణాలను త్వరితగతిన అందించాలని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. నల్లగొండలోని డీసీసీబీలో ఆధునీకరించిన ఏటీఎంను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం బ్రాంచ్ మేనేజర్ల సమావేశంలో మాట్లాడారు. బ్యాంకు నిర్దేశించిన రుణాలను అందించడంలో మేనేజర్‌లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు రూ.100 కోట్ల గృహనిర్మాణ రుణాల లక్ష్యాలను వేగంగా పూర్తిచేయాలన్నారు. డీసీసీబీ పరిధిలో ప్రభుత్వం విడుదల చేసిన రుణమాఫీ నిధులు రూ.279 కోట్లను రైతుల ఖాతాల్లో జమచేశామన్నారు. బంగారు ఆభరణాలపై రూ.450 కోట్ల రుణాలు అందించినందుకు బ్యాంకు మేనేజర్లను అభినందించారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు పాలకవర్గం సిద్ధంగా ఉందని తెలిపారు. సమావేశంలో సీఈఓ శంకర్‌రావు, బ్యాంకు డైరెక్టర్లు గుడిపాటి సైదులు, పాశం సంపత్‌రెడ్డి, అందెల లింగంయాదవ్, నాబార్డు, డీసీసీబీ అధికారులు, బ్రాంచ్ మేనేజర్లు పాల్గొన్నారు.



ఏటీఎంను ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా..

- ఏడు జిల్లాల్లో చోరీలు
- పోలీసుల అదుపులో దొంగ

కొండాపూర్(సంగారెడ్డి): తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం కొండాపూర్ సీఐ చంద్రయ్య వెల్లడించారు. హుజూర్‌నగర్ మండలం కరక్కాయలగూడేనికి చెందిన సన్నిధి ఆంజనేయులు వృత్తి రీత్యా తాపీ మేస్త్రీ. జల్సాలకు అలవాటుపడి దొంగతనాలను ప్రవృత్తిగా చేసుకున్నాడు. తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్నాడు. బుధవారం రాత్రి సీసీఎస్ పోలీసులు మల్కాపూర్ చౌరస్తాలో వాహనాల తనిఖీ చేస్తుండగా ఆంజనేయులు అనుమానాస్పదంగా కనిపించాడు. అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించగా చేసిన దొంగతనాలు ఒప్పుకున్నాడు. ఇప్పటి వరకు నల్లగొండ, సూర్యాపేట, వరంగల్, ఖమ్మం, వికారాబాద్, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో చోరీలకు పాల్పడ్డాడని, 30 కేసుల్లో నిందితుడిగా ఉండగా, ఇటీవల వికారాబాద్‌లో అరెస్ట్ అయ్యి జైలు జీవితం గడిపి మే 10వ తేదీన విడుదలయ్యాడని తెలిపారు. నిందితుడిపై 39 తులాల బంగారం, 189 తులాల వెండి, 2 బైక్‌లతోపాటు రూ.9.50 లక్షల నగదును అపహరించినట్లు కేసులు నమోదయ్యాయని వివరించారు. ప్రస్తుతం 15 తులాల బంగారం స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో సీసీఎస్ ఎస్సై శ్రీకాంత్, కొండాపూర్, మునిపల్లి ఎస్సైలు హరిశంకర్ గౌడ్, రాజేశ్ నాయక్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పులిచింతలకు తగ్గిన ఇన్‌ఫ్లో

హుజూర్‌నగర్: పులిచింతల ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో చాలా వరకు తగ్గింది. గురువారం ప్రాజెక్టు సమీపంలో నదీ పరీవాహక ప్రాంతాల నుంచి 2,050 క్యూసెక్కులు, సాగర్, టెయిల్ పాండ్‌ల నుంచి 28,449 క్యూసెక్కుల నీరు వస్తోంది. దీంతో ప్రాజెక్టులోని 2 క్రస్ట్ గేట్లను 2.5 మీటర్లు పైకి ఎత్తి స్పిల్‌వే ద్వారా 41,456 క్యూసెక్కుల నీటిని, తెలంగాణ జెన్‌కోకు 16 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా ప్రస్తుతం 43.79 టీఎంసీల నీరు ఉంది. పూర్తి రిజర్వాయర్ నీటి మట్టం 175 అడుగులకుగాను 173.71 అడుగుల వరకు ఉంది.

యాదాద్రిలో ఎమ్మెల్సీ కోదండరాం పూజలు



శ్రీస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ కోదండరాం దంపతులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని ఎమ్మెల్సీ కోదండరాం దంపతులు గురువారం దర్శించుకున్నారు. ఉదయం బ్రేక్ దర్శనం సమయంలో ఆలయానికి చేరుకున్న వారికి అధికారులు, అర్చకులు సంప్రదాయంగా స్వాగతం పలికారు. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకున్న ఎమ్మెల్సీ కోదండరాం దంపతులు, ముఖ మండపంలోని సువర్ణ పుష్పార్చనమూర్తుల చెంత ప్రత్యేక అష్టోత్తర పూజల్లో పాల్గొన్నారు. వారికి అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

విధులకు ఆటంకం కల్గించిన వ్యక్తిపై కేసు నమోదు

మునగాల: మండలంలోని మాధవరం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న మహిళను కొక్కిరేణి గ్రామానికి చెందిన ఎల్లావుల సైదయ్య ఆర్టీఐ యాక్ట్ కింద సమాచారం అడగగా.. నిర్ణీత గడువు కాకముందే ఉద్దేశపూర్వకంగా ఆమెను బెదిరించినందుకు గాను గురువారం అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి. ప్రవీణ్‌కుమార్ తెలిపారు. తనకు తరచూ సైదయ్య ఫోన్ చేసి బెదిరించడంతో పాటు తాను విధులు నిర్వహిస్తున్న ప్రాంతానికి వచ్చి అసభ్యకరంగా మాట్లాడుతూ.. ఫొటోలు, వీడియోలను తీసి తాను డ్యూటీలో లేనట్లుగా సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నాడని పంచాయతీ కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సైదయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఇదే సైదయ్య గతంలో కూడా కొక్కిరేణి గ్రామ పంచాయతీ కార్యదర్శి విధులకు ఆటంకం కల్గించడంతో కేసు నమోదయ్యిందని, ప్రస్తుతం ఆ కేసు కోర్టులో ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

ఉత్తమ గురువులకు అవార్డు



కలెక్టరేట్‌లో గురువారం కూనూరు జెడ్పీహెచ్ఎస్ జీహెచ్ఎం హీర్యాకు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందజేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే కుంభం, కలెక్టర్ హనుమంతు కె.జెండగే



తిరుపతిరెడ్డి, ఎస్జీటీ, పీఎస్ సాయిగూడెం



అయ్యాజ్ అహ్మద్, ఎస్జీటీ, సుంకిశాల



గోపాల్‌రెడ్డి, జీహెచ్ఎం, జెడ్పీహెచ్ఎస్, మోత్కూర్



ఉపేందర్‌రావు, ఎస్ఏ, జెడ్పీహెచ్ఎస్, తుర్కపల్లి



రామదాసు, ఎస్ఏ, జెడ్పీహెచ్ఎస్, బొల్లేపల్లి



నాగజ్యోతి, ఎస్ఏ, జెడ్పీహెచ్ఎస్, మర్యాల



సంతోష్‌కుమార్, జెడ్పీహెచ్ఎస్ చీకటిమామిడి



శ్రీధర్, జెడ్పీహెచ్ఎస్, కప్రాయిపల్లి



సంధ్య, ఎస్ఏ, యూపీఎస్, ప్యారారం



శిరోమణి, జెడ్పీహెచ్ఎస్(జి), రాజాపేట



శోభారాణి, ఎస్ఏ, యూపీఎస్, నందనం



సత్యనారాయణ, జెడ్పీహెచ్ఎస్, చౌటుప్పల్



వీరేశం, జెడ్పీహెచ్ఎస్, ముత్తిరెడ్డిగూడెం



ఖాజా రఫతుల్లా, యూపీఎస్, జలాల్‌పూర్



చంద్రకళ, పీఎస్, కొలనుపాక



రమాదేవి, ఎస్జీటీ, పీఎస్, గొల్లగూడెం



చందులాల్, ఎస్జీటీ, జీపీఎస్, గంజ్



శ్రీదేవి, ఎస్జీటీపీఎస్, రామునితండా



శ్రీనివాసులు, పీఎస్, పుట్టపాక



రమేష్, ఎస్జీటీ, మాటూరు



యాదిరెడ్డి, ఎస్జీటీ, మల్లారెడ్డిగూడెం



శ్రీనివాస్, ఎస్జీటీ, బాలంపల్లి



రమేష్, ఎస్జీటీ, నాయకునితండా

పట్టుబడిన మద్యం ధ్వంసం

నాగారం: ఎన్నికల సమయంలో పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన మద్యాన్ని గురువారం నాగారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎక్సైజ్ అధికారులు ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎక్సైజ్ అధికారి లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ.. 2023–2024 సంవత్సరంలో నాగారం పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన 36 లిక్కర్ కేసులకు సంబంధించి 243 లీటర్ల మద్యం, బీర్లు పట్టుబడినట్లు తెలిపారు. ఈ మద్యాన్ని జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎక్సైజ్, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ధ్వంసం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ట్రాస్క్‌ఫోర్స్ సీఐ మల్లయ్య, తుంగతుర్తి ఎక్సైజ్ సీఐ రజిత, ఎక్సైజ్ ఎస్ఐ మూర్తి, ఏఎస్ఐ వెంకటయ్య, రైటర్ శేఖర్, పోలీసు సిబ్బంది నారాయణరెడ్డి, ఎల్లయ్య తదితరులున్నారు.

సూర్యాపేటలో..

సూర్యాపేటటౌన్: గత సంవత్సర కాలంగా ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో పట్టుబడిన మద్యాన్ని గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీస్ స్టేషన్‌లో ధ్వంసం చేశారు. 72 కేసుల్లో పట్టుబడిన మద్యం బాటిళ్లను నల్లగొండ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ప్రొహిబిషన్ ఉత్తర్వుల మేరకు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో పట్టణ పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు పగులగొట్టి మద్యం పారబోశారు. వీటి విలువ సుమారు రూ.2.5లక్షలు ఉంటుందని పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ లక్ష్మణ్‌నాయక్, పోలీసులు ఉన్నారు.



పట్టుబడిన మద్యాన్ని పారబోస్తున్న పోలీసులు

భార్యను వేధించిన వ్యక్తికి మూడేళ్ల జైలు

చౌటుప్పల్: భార్యను వేధించిన వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ గురువారం చౌటుప్పల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి తీర్పునిచ్చారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం లక్ష్మిగూడ గ్రామానికి చెందిన శివకుమార్(32) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతను తన భార్యను వేధిస్తుండడంతో 2016లో చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు గురువారం కేసు విచారణ జరగగా శివకుమార్‌కు మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.10వేల జరిమానా విధిస్తూ జడ్జి మహతీవైష్ణవి తీర్పునిచ్చారు. నిందితుడిని నల్లగొండ జైలుకు తరలించినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు

తిప్పర్తి: తిప్పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని కేశరాజుపల్లిలో నివాసముంటున్న మహిళ అదృశ్యమైనట్లు గురువారం ఆమె తండ్రి ఫిర్యాదు చేశాడని ఏఎస్ఐ రాంమూర్తి తెలిపారు. చండూరు మండలం కొండాపురం గ్రామానికి చెందిన రూపాని అరుణ తన భర్తతో గొడవల కారణంగా గత ఐదు నెలల నుంచి కేశరాజుపల్లిలో రూం అద్దెకు తీసుకుని ఉంటుంది. ఆగస్టు 29న ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. ఎంత వెతికినా అరుణ ఆచూకీ లభించకపోవడంతో ఆమె తండ్రి ఓర్సు వెంకటయ్య చిట్యాల మండలం పేరేపల్లి గ్రామానికి చెందిన రూపాని అనిల్‌పై అనుమానం ఉన్నట్లు గురువారం తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి(నల్లగొండ): నల్లగొండ ఎన్జీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను గెస్ట్ లెక్చరర్లుగా పనిచేయుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఉపేందర్ గురువారం తెలుగు 6, హిందీ 1, ఉర్దూ 1, వాణిజ్య శాస్త్రం 1, కంప్యూటర్ సైన్స్/అప్లికేషన్స్ 2, బిజినెస్ అనాలటిక్స్ 1, అర్థశాస్త్రం 2, భౌతికశాస్త్రం 1, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ 1 పొలిటికల్ సైన్స్ 2 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు ఫారాలను కళాశాల కార్యాలయంలో సెప్టెంబర్ 10వ తేదీ లోపు అందజేయాలని కోరారు.

పాఠశాలలో నీరు లేక అవస్థలు



పాఠశాల బయటికొచ్చి బ్రష్ చేసుకుంటున్న విద్యార్థులు

కోదాడరూరల్: మండల పరిధిలోని నెమలిపురిలో ఉన్న బీసీ బాలుర గురుకుల పాఠశాలలో నీరు లేక విద్యార్థులు గురువారం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. 530 మంది విద్యార్థుల ఉన్న ఈ పాఠశాలలో నీరు లేకపోవడంతో విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు పాఠశాలకు సమీపంలోని రెడ్లకుంట మేజర్ ఎన్ఎస్పీ కాలువ, పీపీవీల వద్దకు వచ్చారు. అయితే బుధవారం రాత్రి కరెంట్ లేకపోవడంతో పాఠశాలలో నీరు లేదని, కరెంటు లేని ప్రతిసారి ఇలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని విద్యార్థులు తెలిపారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ అనురాధను వివరణ కోరగా ఉన్న నీరు ఉదయమే అయిపోయిందని, బుధవారం రాత్రి విద్యుత్ లేకపోవడంతో నీటికి ఇబ్బందులు ఏర్పడ్డాయని తెలిపారు. విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు బయటకు వెళ్లగా.. వారి వెంట నలుగురు ఉపాధ్యాయులను సహాయకులుగా పంపించానని పేర్కొన్నారు.

గొర్రెల మంద పైనుంచి దూసుకెళ్లిన బొలేరో

- 15 గొర్రెలు మృత్యువాత

పెద్దవూర: గొర్రెల మందపై నుంచి బొలేరో వాహనం దూసుకెళ్లడంతో 15 గొర్రెలు మృత్యువాత పడిన సంఘటన పెద్దవూర మండల పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా ఇమాంపేటకు చెందిన నగిరే గంగరాజు, మరికొంత మంది రైతులు కలిసి గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో గొర్రెల మందలు మేపుకుంటూ కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారిపై వెళ్లే క్రమంలో సంగారం స్టేజీ దాటాక మల్లేపల్లి వైపు నుంచి అతివేగంగా వచ్చిన బొలేరో వాహనం నేరుగా గొర్రెల మందపై నుంచి దూసుకెళ్లింది. దీంతో 15 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా, పదకొండు పైగా గొర్రెలు పైగా గాయపడ్డాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ వీరబాబు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి కారణమైన బొలేరో వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వీరబాబు తెలిపారు.



గొర్రెల కళేబరాలను పరిశీలిస్తున్న ఎస్ఐ వీరబాబు



వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట డీఎస్పీ రవి

రెండు కిలోల గంజాయి పట్టివేత

- ముగ్గురి అరెస్ట్

సూర్యాపేటటౌన్: గంజాయి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో నిందితుల వివరాలను డీఎస్పీ రవి విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణంలోని అన్నాదురై నగర్‌కు చెందిన భోగ చరణ్, జేజేనగర్‌కు చెందిన చిలకరాజు సందీప్, మరో వ్యక్తి కలిసి ఆంధ్రప్రదేశ్‌లోని అరకులో గంజాయి కొనుగోలు చేసి సూర్యాపేటకు తీసుకొచ్చారు. బుధవారం సాయంత్రం 5గంటల సమయంలో స్థానిక రాజీవ్‌పార్కు సమీపంలో గంజాయిని ఇతరులకు విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో సీఐ రాజశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.